క్లుప్తంగా

ఘనంగా శ్రీరేగట్లమ్మ పండగ


రేగట్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం : శ్రీ రేగట్లమ్మ అమ్మవారి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. పెదగొలుగొండపేట శ్రీ రేగట్లమ్మను గ్రామస్తులు పూర్వం నుంచి గ్రామదేవతగా పూజిస్తారు. అనవాయితీ ప్రకారం పండగను మంగళవారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఏర్పాటు చేశారు.

రెల్లరాల్చు పురుగు నివారించాలి


పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, అమలాపురం గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వరిపంటను పరిశీలించారు. వరి పంటను నాశనం చేస్తున్న రెల్ల రాల్చు పురుగు నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏవో అప్పారావు పేర్కొన్నారు. పురుగు నివారణకు క్లోరంట్రానిలిప్రోల్, ఇమామెక్టిన్ బెంజూఎట మందును సాయంత్రం వేళలలో పిచికారి చేయాలన్నారు.

సామూహిక వ్రతాలు


స్వామి వారి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తర వాహిని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. దంపతులు విచ్చేసి సామూహిక వ్రతాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెరివిల్లి భద్రాచలం రామం వ్రత కార్యక్రమాన్ని నడిపించారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

లింగ వివక్షను నిరసించాలి


బుచ్చెయ్యపేటలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు

బుచ్చెయ్యపేట : సమాజంలో ఆడ,మగ ఇద్దరూ సమానమే అని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం బుచ్చెయ్యపేట మండల పరిషత్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలతో లింగవివక్ష హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఏపీఎం రాజబాబు సూచించారు.

అపరాల విత్తనాల పంపిణీ


విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ: స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం రబీ అపరాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా రైతులకు విత్తనాలు అందజేశారు. ఏవో కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దే వద్దు

దేవరాపల్లి: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ టి. మల్లేశ్వరరావు సూచించారు. తెనుగుపూడి డా. బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, పీఈటీ జి. తరుణేశ్వరరావు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఉల్లి శ్రీను పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

మెట్ట గ్రామాల్లో బంతిపూల సిరులు

- మండలంలో విరివిగా ఎకరాల్లో సాగు
- అనకాపల్లి, గాజువాక, విశాఖల్లో అమ్మకాలు
- ప్రస్తుత సీజన్‌లో మంచి డిమాండ్


పూలను అమ్మకాలను చేసేందుకు సేకరిస్తున్న రైతు

కె.కోటపాడు : మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు బంతిపూల సాగును విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా గొల్లలపాలెం, మెరక రామచంద్రపురం, కె.సంతపాలెం, ఆర్లి, కింతాడ గ్రామాల్లో రైతులు 30 ఎకరాల్లో బంతిపూలను పండిస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు నీటి వసతి ఉన్న పొలాల్లో సాగు చేపడుతున్నారు. ప్రధానంగా కార్తీకమాసం, ధనుర్మాసంతో పాటు శుభకార్యాల సమయాల్లో బంతిపూలకు మంచి డిమాండ్ ఉండనున్నది. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో మాలాధారులైన భక్తులు పూజల్లో బంతిపూలను ఎక్కువగా వినియోగించనున్నారు. దీంతో ప్రస్తుత సమయంలో బంతిపూలకు మంచి డిమాండ్ ఉండడంతో మంచి మద్దతు ధర లభించనున్నట్లు సాగు రైతులు తెలుపుతున్నారు.

ఎకరాకు రూ.50వేల పెట్టుబడి

బంతిపూల పంటను సాగు చేసేందుకు ఎకరాకు కనీసం రూ.50వేల వరకూ పెట్టుబడి అవుతుంది. పొలం దుక్కులు చేసి ఎరువులు అందించడంతో పాటు బంతి ఏనారు, గొప్పులు చేసేందుకు పెట్టుబడి అవుతుంది. బంతి పంట సాగు ప్రారంభించిన 20 రోజుల నుంచి పూల దిగుబడి ప్రారంభం అవుతుంది. పూల దిగుబడి మూడు నుంచి నాలుగు నెలల వరకూ ఉంటుందని రైతులు చెబుతున్నారు. బంతి మొక్కల నుండి ప్రతి మూడు నుంచి నాలుగు రోజులకు ఒకసారి పూలను సాగు రైతులు సేకరిస్తున్నారు.

మంచి మద్దతు ధర

ఐదు కిలోల బరువు గల కవర్‌లలో గల బంతి పూలకు రూ.300 నుంచి రూ.400 వరకూ మద్దతు ధర దక్కనున్నది. ఎకరాల పొలంలో నాలుగు నెలల కాలంలో బంతిపంట సాగు ద్వారా పెట్టుబడులు పోను రూ.50 వేల ఆదాయం వస్తుందని సాగు రైతులు పేర్కొంటున్నారు. పండించిన బంతిపూలను పరిసర గ్రామాల్లో ప్రజలు స్థానికంగా పంట పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మిగిలిన పూలను సాగు రైతులు విశాఖపట్నం, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల్లో అమ్మకాలను చేసేందుకు తీసుకువెళ్తున్నారు.

గిరాకీ బాగుంది



బంతిపూలకు ప్రస్తుత సీజన్‌లో మంచి డిమాండ్ ఉండడంతో మంచి ధర పలుకుతుంది. బంతిపూల సాగుతో ఆదాయం బాగానే వస్తుంది. ప్రధానంగా నీటి వసతి ఉన్న పొలాల వద్ద బంతిపంటను సాగు చేయడం మంచిది. అయ్యన్న, భవానీ మాలాధారులైన భక్తులు ప్రస్తుత కార్తీకమాసంలో నిర్వహించే పూజల్లో ఉపయోగించేందుకు బంతిపూలను పొలాల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. రాబోయే రోజుల్లో ధనుర్మాసం కావడంతో అప్పటి వరకూ సాగులో ఉన్న బంతిపూలకు మంచి మద్దతు ధర దక్కనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. **–పిల్లల తాతారావు**, గొల్లలపాలెం, బంతిపూల సాగు రైతు

పాఠశాలల వేళల పెంపుతో విద్యార్థులపై ఒత్తిడి


కింతాడలో కస్తూర్బా పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సత్యంనాయుడు, పోతల నాయుడు

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో పెంచిన పని వేళల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అడిగర్ల సత్యంనాయుడు, మండల కార్యదర్శి పోతల నాయుడు అన్నారు. మండలంలో పలు పాఠశాలలు, కింతాడలో గల కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసిన వీరు పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సత్యంనాయుడు, పోతల నాయుడు మాట్లాడుతూ చుట్టుపక్కల రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెంచిన పనివేళల సమయాలు ఎక్కడా అమలు కాలేదన్నారు. పని వేళల పెంపుతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందన్నారు. కొఠారి కమిషన్ సూచన మేరకు పాత పని వేళలను అమలు చేయాలన్నారు. వచ్చే మార్చి నెలలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటును గాదె శ్రీనివాసులనాయుడుకు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలతో పాటు పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించి మెరుగైన ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఇమంది ప్రవీణ్, రమేష్, ఉమ, చంద్రకళ, దేముడమ్మ, శిరీష పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు

మాకవరపాలెం : సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేయాలని ఏవో చిరంజీవి రైతులకు సూచించారు. మండలంలోని జి.కోడూరులో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులతో సాగు చేసేందుకు రైతులు దృష్టి సారించాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలను వివరించారు. కార్యక్రమంలో ఏఈవో శేషునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య సేవలు


గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరిస్తున్న వైద్యాధికారి తరణి

కె.కోటపాడు : గర్భిణులు పౌష్టిక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని వైద్యాధికారి తరణి అన్నారు. కొత్త అగ్రహారం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు జరిపారు. 133 మంది వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకోవడం తల్లి బిడ్డకు క్షేమదాయకమని అన్నారు. పప్పు దినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహారం తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ అచ్చియ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి, ఏఎన్ఎం చిన్నమ్ములు పాల్గొన్నారు.

29 వరకూ ప్రత్యేక ఆధార్ కేంద్రాలు


వడ్డాది కాలేజీలో విద్యార్థుల ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ అన్నపూర్ణ

మాడుగుల రూరల్ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలును పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, స్థానిక ఎంపిడిఓ కోంకి అప్పారావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు. మాడుగులలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో ఆధార్ సేవా కేంద్రాలు నిర్వహించబడతాయని, ఈ కేంద్రాలు ఈ నెల 29 వరకు కొనసాగుతాయన్నారు. పాఠశాల విద్యార్థులు పుట్టిన తేదీ ధ్రువపత్రాలు ఆధారంగా ఆధార్ సవరణ చేస్తారని , పాఠశాల, కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బుచ్చెయ్యపేట : విద్యార్థులు కాలేజీలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసికోవాలని వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ కోరారు. మంగళవారం కాలేజీలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థుల సమాచారం అప్‌డేట్ కోసం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో బాలబాలికలంతా కలిసి నెలాఖరులోగా అపార్ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కాలేజీ యాజమాన్యం నరసింహమూర్తి, సచివాలయ సిబ్బంది శేఖర్ పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీటి కోసం రైతుల పాట్లు

శ్రమదానంతో తాండవ కాలువలో పూడిక తొలగింపు


తాండవ కాలువలో పూడిక తొలగిస్తున్న రైతులు

నాతవరం : వరి పంట చివర దశలో ఉండడంతో కాపాడుకోవడం కోసం రైతులు శ్రమదానంతో తాండవ కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. తాండవ రిజర్వాయరులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ కాలువలో పూడిక పేరుకుపోవడంతో శివారు ఆయకట్టుకు నీరు అందడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురియకపోవడంతో పొట్ట దశలో వరి చేనుకు నీరు అవసరం ఉంది. శివారు ఆయకట్టుకు నీరు అందించలేమని అధికారులు చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ, అనకాపల్లి రెండు జిల్లాల పరిధిలో నాతవరం, కోటనందూరు మండలాలకు చెందిన 259 మంది రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రాంతాల్లో తాండవ కాలువలో పూడిక తొలగించుకున్నారు. దీంతో ఆయకట్టు భూములకు ఓ మోస్తరు నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు అంటున్నారు. అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం, కోటవురట్ల, నాతవరం మండలాల పరిధిలో శివారు గ్రామాల రైతులకు నీరు అవసరం ఉందని అంటున్నారు.

వరిలో రెల్లరాల్చు పురుగు ఉధృతి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీ వాసుదేవరావు

మాడుగుల రూరల్ : ఖరీఫ్ వరి పంట గింజ గట్టి పడే దశలో వుందని, ఈ దశలో పంటకు రెల్లరాల్చు పురుగు ఆశిస్తుందని స్థానిక మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు పేర్కొన్నారు. కె.వల్లాపురం, అవురువాడ, గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రెల్లరాల్చు పురుగు వరి దుబ్బులు మొదళ్లలో వుండి కేవలం రాత్రి సమయంలో మాత్రమే వరి వెన్నులు కొరికి రైతులకు ఆర్థికంగా నష్టాన్ని కలుగజేస్తుందని, రైతులు ప్రతి రోజు పొలాన్ని పరిశీలిస్తూ పురుగు ఆశించిన వెంటనే నివారణకు మందును పిచికారీ చేయాలన్నారు. పెర్మెత్రిన్ 400 మిల్లీ లీటరు మందును ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. లేదా బైఫెంత్రిన్ 500 మిల్లీ లీటరు మందును లేదా, ఇండాక్సా కార్బ్ 200 మిల్లీ లీటరు మందు లేదా కోరాజన్ 60 మిల్లీ లీటర్లు, లేదా ఇమామెక్టిన్ బెంజాయేట్ 80 గ్రాములు పై వాటిలో ఏదైన ఒక మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది కళ్యాణ్, స్వప్న పాల్గొన్నారు.

పీహెచ్‌సీలోనే కాన్పులు జరగాలి


గంధవరం ఆరోగ్య కేంద్రం సందర్శించిన డీపీవో

చోడవరం రూరల్ : గ్రామాల్లోని ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే జరిగేలా చూడాలని ఆరోగ్య సిబ్బందిని జిల్లా ఆరోగ్య అధికారి ల్యూసీకార్డీలియా సూచించారు. మంగళవారం గవరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గంధవరం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. బృందానికి నాయకత్వం వహించిన లూసీ కార్డీలియా సిబ్బందిని ఉద్దేశించి గర్భిణులు, బాలింతలలో రక్తహీనత సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందచేయాలని ఆదేశించారు. గణాంక అధికారి రామచంద్రరావు, డీపీవో జగదీష్, కోఆర్డినేటర్ జనార్దన్‌లు రికార్డులను తనిఖీ చేశారు. గవరవరం ఎంపీహెచ్‌ఓ రవి, హెచ్‌వీ పద్మ, ఎంఎల్‌హెచ్‌వీ శ్రీలక్ష్మి, ఏఎన్ఎం చిట్టెమ్మ, హెచ్ఏ వెంకటేష్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రూసెల్లో టీకాలు తప్పక వేయించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల : ఎనిమిది నెలలు వయస్సు గల ఆడపెయ్యిలుకు బ్రూసెల్లో టీకాలు వేయించాలని పశు వైద్యశాఖ సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు పాడి రైతులకు సూచించారు. సత్యవరం గ్రామంలో బ్రూసెల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమాలు వచ్చే నెల 19 వ తేదీ వరకు జరుగుతాయన్నారు. మండలంలో 120 ఆడ పెయ్యిలకు ఈ టీకాలు వేయడం జరిగిందన్నారు. సత్యవరం, కేజేపురం రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. కేజేపురం పశువైద్యాధికారి మణిలక్ష్మణ్, సహాయకులు చంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

క్రీడలపై విద్యార్థులు మరింత ఆసక్తి చూపాలి


తైక్వాండో క్రీడాకారులను సత్కరించిన ఎమ్మెల్యే రాజు

చోడవరం : విద్యార్థుల క్రీడలపై మరింత శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు అన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను చోడవరంలో మంగళవారం సత్కరించారు. ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని అన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు చుక్కల రాస్య, వి. శారద, కె. కార్తికేయ, సూహాన్, ఎ.పూజశ్రిత, కె.రాజ్‌కుమార్, చారిక్ మోహిత్, కృతిషర్మి, బరద్వాజ్, ఎస్. జ్ఞానవి, బి.జ్యోతిస్మిత, ఎ.దేవాన్ష్, ఎస్.ప్రియాంజన్‌సాయి, ఎస్.జినీత్‌కుమార్, బి.యోదాత్యభార్గవ్, పి. జశ్వంత్, ఎస్.విజయేందర్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి, కోచ్‌లు ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవం
- అంబేడ్కర్‌కు నివాళులు
- రాజ్యాంగ పరిరక్షణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ


నర్సీపట్నం : అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి


నాతవరం : అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంఈవోలు సత్యనారాయణ, వరహాలబాబు


దేవరాపల్లి : తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్ఐ మల్లేశ్వరరావు


చీడికాడ గ్రంథాలయంలో ప్రతిజ్ఞ


చోడవరం రూరల్ : రాజ్యాంగ పరిరక్షణ పట్ల ప్రమాణం చేయిస్తున్న ప్రిన్సిపాల్


దేవరాపల్లిలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీదేవి


రోలుగుంట : పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు


బుచ్చెయ్యపేట సచివాలయంలో..


గొలుగొండ : అంబేడ్కర్‌ను నివాళులు అర్పిస్తున్న దృశ్యం


మాడుగుల రూరల్ : డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు


మాకవరపాలెం : తూటిపాలలో మానవహారం


కె.కోటపాడు హైస్కూల్లో అంబేడ్కర్‌కు నివాళులు

నర్సీపట్నం : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదబొడ్డేపల్లి 40 అడుగుల రోడ్డులో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం పూలమాల వేసి నివాళులర్పించారు. బేతిరెడ్డి విజయ్, బుచ్చిరాజు పాల్గొన్నారు.

- మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఈవో తలుపులు డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, సీఐ జి.గోవిందరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు. రాజ్యాంగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు.
- చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశిక్షణ సంస్థ భీమిలికి చెందిన సీనియర్ ఉపన్యాసకులు గొట్టేటి రవి పాల్గొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు భారత రాజ్యాంగం గురించి అవగాహన కల్పించాలన్నారు. నమూనా పార్లమెంటు నిర్వహించారు. స్కూల్ చైర్మన్ పి.ఈశ్వరరావు, హెచ్ఎం హిమబిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొలుగొండ : భారతదేశ రాజ్యాంగం అన్ని దేశాల కంటే గొప్పదని ఏఎల్‌పురం సర్పంచ్ లోచ ల సుజాత అన్నారు. ఏఎల్‌పురంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

నాతవరం : అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ పాటు పడాలని ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

మాకవరపాలెం : అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ సి.మోహన్‌రావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం ప్రకారం అందరూ నడుచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

మాడుగుల : భారత రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడు గౌరవించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వెంకటరాజారామ్, ఎంపీటీసీలతో 75 వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడారు. ప్రాథమిక హక్కులు, ప్రవేశిక, ప్రాథమిక బాధ్యతల గురించి వివరించారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఎంపీటీసీలు అప్పారావు, సూర్యకాంతం జగ్గారావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శాస్త్రి మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజ్యాంగం కీలక భూమిక పోషించిందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.రామ్‌కుమార్ , వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, ఇతర ఉపన్యాసకులు పాల్గొన్నారు. విద్యార్థులతో రాజ్యాంగ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.

మాకవరపాలెం : ఎమ్మార్సీ భవనంలో సిబ్బందితో కలసి ఎంఈవో మూర్తి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. తూటిపాల, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో సోషల్ ఎగ్జిబిషన్‌ను ఎంఈవో, విద్యార్థులు తిలకించారు. కేజీబీవీ ఎస్‌వో త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : భారత రాజ్యాంగ నిర్మాణంతో దేశంలో అన్ని వర్గాల వారికి సమాన హక్కులను కల్పించిన ఘనత డాక్టర్ అంబేడ్కర్‌కు దక్కుతుందని ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు అన్నారు. మంగళవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఎంఈవో ప్రసాద్, ఏపీఎం చినబాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం హిమబిందు పాల్గొన్నారు. చౌడువాడ గ్రంథాలయంలో అంబేడ్కర్‌కు గ్రంథాలయాధికారి పద్మావతి నివాళులర్పించారు.

చోడవరం : అంబేడ్కర్ భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా రాజ్యాంగాన్ని నిర్మించారని కొనియాడారు. ట్రస్టు ప్రతినిధులు దేముడు మాస్టారు, ప్రకాష్, వరప్రసాద్, కండెల వెంకట్రావు, జుంజూరి అప్పారావు, సియాంద్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు. జుత్తాడ ప్రభుత్వ స్కూల్లో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్ఎం శేషగిరిరావు, టీచర్లు పాల్గొన్నారు.

దేవరాపల్లి: రాజ్యాంగాన్ని ప్రతి పౌరుడు గౌరవించాలని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎస్ఐ టి.మల్లేశ్వరరావు అన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ పెంటమ్మ, సమితి సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బహుజన కళామండలి రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ భాస్కర్, ఎస్ఐ మల్లేశ్వరరావు, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ సభ్యులు రమణ, కాటపల్లి అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీఈటీ తరుణేశ్వరరావు పాల్గొన్నారు.

చీడికాడ : స్థానిక గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జోగశ్వరి రాజ్యాంగం గురించి వివరించారు. పాఠకులతో ప్రతిజ్ఞ చేయించారు. మంచాల మోడల్ స్కూల్లోనూ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

రోలుగుంట : రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్.ఎం ప్రసాద్ రాజ్యాంగం గురించి విద్యార్థులకు వివరించారు. కుసుర్లపూడిలో హెచ్ఎం శెట్టి మోహన్, ఉపాధ్యాయులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. టీచర్ అప్పన రాంబాబు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

చోడవరం రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. హెచ్‌ఓడీలు రాధాకృష్ణ, అప్పలనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుందర్‌సింగ్ విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులను గౌరవించాలని బుచ్చెయ్యపేట సర్పంచ్ సుంకర లక్ష్మి కోరారు. పలు గ్రామాల సచివాలయాలతో పాటు ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవో లవరాజు పాల్గొన్నారు.